
**హాస్టళ్లలో ఆకలి కేకలు** 2





**డీఎస్‌కు ఘననివాళి..** 2

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

29-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, కామారెడ్డి:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం ఆధ్వర్యంలో http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## శివాలయంలో పీసీసీ చీఫ్ పూజలు



**అక్షరటుడే, మాక్లూర్:** మండలంలోని మదనపల్లి గ్రామంలో శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో సోమవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో అద్భుతంగా ఆలయాన్ని నిర్మించిన గ్రామస్తులను ఆయన అభినందించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. శివుడి అనుగ్రహంతో పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. నాయకులు వినయ్ కుమార్ రెడ్డి, నాగేష్ రెడ్డి, ఆకుల లలిత, శ్రీనివాస్ గౌడ్, దయాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం.. 45 లక్షల మొక్కలు



**పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం నిజామాబాద్ జిల్లాలో జోరుగా సాగుతోంది. జిల్లాలో ఈ ఏడాది 45 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మహా యజ్ఞాన్ని విజయవంతం చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

■ వన మహోత్సవానికి సర్వం సిద్ధం ■ మూడున్నర లక్షల గుంతల తవ్వకం పూర్తి ■ వర్షాల కోసం నిరీక్షణ

ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 26.11 లక్షల మొక్కలను నాటేందుకు నిధులు కేటాయించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ, ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున 14 లక్షల మొక్కలను పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు అటవీ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో మిగిలిన మొక్కలను ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా నాటించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

### శాఖల వారీగా..

వన మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులను ప్రభుత్వం భాగస్వామ్యం చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖకు ఉపాధి హామీ పథకం కింద 26.11 లక్షల మొక్కల పెంపకానికి నిధులు కేటాయించారు. అటవీ శాఖ 14 లక్షల మొక్కలను సిద్ధం చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో పార్కులు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడానికి మున్సిపల్ కార్పొరేషన్లు, బల్దియాలు బాధ్యత వహిస్తున్నాయి . నిజామాబాద్ నగరంలో సుమారు 3 లక్షల మొక్కలు నాటనున్నారు. గీత కార్మికుల ప్రయోజనం కోసం 66 వేల ఈత మొక్కలు నాటనున్నారు.

### సిద్ధంగా గుంతలు

మొక్కలు నాటడానికి ముందుగా భూమిని సిద్ధం చేయడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడున్నర లక్షల గుంతలను తవ్వి సిద్ధం చేశారు. మొక్కలను నర్సరీల నుంచి నేరుగా నాటే ప్రదేశాలకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం వర్షాల కోసం ఎదురు చూస్తున్నామని, వాతావరణం అనుకూలించి తొలి వర్షం కురవగానే యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటే ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రజలు సైతం సహకరించాలని కోరుతున్నారు.

### లక్ష్యం చేరుకుంటాం

జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన 45 లక్షల మొక్కల లక్ష్యాన్ని చేరుకోవడమే మా ప్రధాన ధ్యేయం. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఇప్పటికే తవ్వి సిద్ధంగా ఉంచాం. వర్షాలు ప్రారంభం కాగానే ఈ ప్రక్రియను వేగవంతం చేస్తాం. ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ, నాటిన ప్రతి మొక్క సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. వాతావరణ పరిస్థితులు సహకరిస్తే, అనుకున్న సమయానికి నిర్దేశిత లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేస్తాం.

– సాయన్న, డీఆర్‌డీవో

## పోలీస్ ప్రజావాణికి 39 ఫిర్యాదులు..



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య 39మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా సీపీ కార్యాలయంలో ప్రజావాణిలో తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా 39 మంది బాధితులు తమ సమస్యలను సీపీకి విన్నవించగా ఆయన వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ఆర్మూర్‌లో ధర్నాలు, రాస్తారాకోలు నిషేధం: సీపీ సాయిచైతన్య




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఆర్మూర్ పట్టణంలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పట్టణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో భరత్ చంద్ర స్కూల్‌లో జరిగిన ఘటనకు సంబంధించి బంద్ పాటిస్తున్నాయని తమకు సమాచారం ఉందన్నారు. అయితే పట్టణంలో 163 బీఎన్ఎస్ అమలులో ఉన్నందున 29, 30వ తేదీల్లో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించవద్దని సూచించారు. పట్టణ నలుమూలలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆర్మూర్ పట్టణంలో ఐదుగురికి మించి గుమిగూడడం, గుంపులుగా చేరడం నిషేధమని చెప్పారు. ఆర్మూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు 163 బీఎన్ఎస్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.

## మహిళలకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(డిచ్‌పల్లి) ఆధ్వర్యంలో జులై 5 నుంచి ప్రారంభమయ్యే శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. టైలర్, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తామని.. దాంతో పాటు భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. 19 నుండి 45ఏళ్లలోపు మహిళలు అర్హులని ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి మెమో, ఐదు ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను అందించాలన్నారు.

## ఆర్మూర్‌లో బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో సోమవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ భరతచంద్ర పాఠశాలలో హిందూ విద్యార్థులకు ఉర్దూ, నమాజ్ నేర్పడం పట్ల తల్లిదండ్రులు, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు రెండ్రోజుల క్రితం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారు. అయితే ఉదయం పోలీసులు, బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని అడ్డుకున్నప్పటికీ నాయకులు ర్యాలీ కొనసాగించారు. భరత్ చంద్ర పాఠశాలను సీజ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాంకు వినతి పత్రం అందజేశారు. కాగా పోలీసులు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలును అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, యామాద్రి భాస్కర్ ప్రజలు పాల్గొన్నారు.



### ఆర్మూర్‌లో వరుస ఘటనలపై ‘సిట్’ వేసి విచారణ జరపాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆర్మూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై తక్షణమే సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో హిందువుల ర్యాలీలో పాల్గొనేందుకు బయలుదేరిన ఆయనను పోలీసులు భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద అడ్డుకుని కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తరలించారు. పోలీసులు తనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రశాంతంగా ఉన్న ఆర్మూర్‌ను అగ్నిగుండంగా మారుస్తున్నాయని ఆరోపించారు. వ్యక్తుల మధ్య జరిగిన ఘటనకు మతం రంగు పులిమారన్నారు. పెర్కిట్ పాఠశాలలో మత మార్పిడికి ప్రయత్నిస్తున్నారని, ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నాయని, విదేశీ నిధులతో మత మార్పిడి చేసే యత్నం జరుగుతోందని ఆరోపించారు.

## మానవతా సదన్ విద్యార్థులకు బుక్స్ అందజేత

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లిలోని మానవతా సదన్‌ను ఏడో బెటాలియన్ ఏఆర్పీ సిబ్బంది సందర్శించారు. పిల్లలతో మాట్లాడారు. సమాజ సేవలో భాగంగా చిన్నారులకు అవసరమైన నోట్ బుక్స్, ప్యాడ్స్, పెన్స్, పండ్లు అందజేసి, వారికి ప్రోత్సాహకరమైన సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, మానవతా సదన్ నిర్వాహకులు ఉన్నారు.



## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏసీపీల నియామకం..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఏసీపీలు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్ ఏసీపీగా శ్రీశైలం నియమితులయ్యారు. ఈయన గతంలో జిల్లాలో సీఐగా, వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. అలాగే నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఆర్ నరేందర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. నిజామాబాద్ సీసీఆర్‌బీ ఏసీపీగా గురునాయుడిని నియమిస్తూ డీజీపీ ఆదేశాలిచ్చారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36మంది అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో కొందరు అధికారులు కొన్నాళ్లుగా పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

## యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలి : పీసీసీ చీఫ్




**అక్షరటుడే, ఇందూరు:** యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ అన్నారు. నగరంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఒలింపిక్ క్రీడల స్ఫూర్తి అయిన క్రమశిక్షణ, ఐక్యత, శాంతి, ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. యువత క్రీడల్లో ఎక్కువగా పాల్గొనాలన్నారు. తద్వారా రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా ఒలింపిక్ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఒలింపిక్ డే రన్‌కు జెండా ఊపి ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి కొంతదూరం పరుగెత్తి వారిని ఉత్సాహపర్చారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, నగర మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నుడా ఛైర్మన్ కేశ వేణు, ఆకుల లలిత, చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## వర్షపు నీరు వెళ్లే మార్గమేది..?



**చిన్నపాటి చినుకులు పడితేనే కామారెడ్డి పట్టణం అతలాకుతలం అవుతోంది. ముఖ్యంగా రహదారులపై నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గం లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. హౌజింగ్ బోర్డు సమీపంలోని అతిథి బార్ ఎదురుగా హైదరాబాద్ వెళ్లే దారిలో వర్షం నీరు సగానికి పైగా రోడ్డుపై నిలిచిపోయింది. బైక్‌లపై వెళ్లేవారు ఈ నీరు కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారు. దానికి తోడు రహదారి ఒకవైపు డౌన్ ఉండటంతో డివైడర్‌ను తాకిన నీళ్లు రోడ్డు పక్కనే చేరి నిలుస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



## తలసేమియా బాధిత చిన్నారులకు అండగా ఉంటాం..

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో తలసేమియా వార్డును టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సోమవారం సందర్శించారు. వార్డులో చికిత్స పొందుతున్న తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులును రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రక్త సరఫరా, ఇతర సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. తలసేమియా బాధిత చిన్నారుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వారికి అవసరమైన వైద్య సేవలు, రక్తం, ఇతర సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నాగేష్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, బాడ్సి శేఖర్ గౌడ్, తోట రాజశేఖర్ పాల్గొన్నారు.



## పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

**అక్షరటుడే, మెండోరా:** జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ సోమవారం పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి సేవల తీరును పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వ కోసం వినియోగిస్తున్న ఐఎల్ఆర్‌ను తనిఖీ చేశారు. వ్యాక్సిన్ల నిల్వ, ఉష్ణోగ్రత నిర్వహణ, కోల్డ్ చైన్ విధానాలను పరిశీలించారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన రిజిస్టర్లు, వ్యాక్సిన్ స్టాక్ రికార్డులు, ఇతర నమోదులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని తల్లి శిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, ఇతర ఆరోగ్య సూచికలపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రాజశ్రీ చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మద్దుల రాకేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**సంక్షేమ వసతి గృహాల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన సమయంలో భోజనం అందక ఆకలితో అలమటిస్తున్నారు. బాత్రుంల డోర్లు లేకపోవడంతో చలిలో ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.**

– అక్షరటుడే, పెద్దకొడప్‌గల్



# హాస్టళ్లలో ఆకలి కేకలు..

### అందని బ్రేక్‌ఫాస్ట్.. విద్యార్థుల ఆరోగ్యంపై నీలినీడలు

పెద్దకొడప్‌గల్ బాలుర గిరిజన వసతి గృహంలో.. వసతి గృహం ఈనెల 15వ తేదీన పునఃప్రారంభమైంది. అయితే గత వారంరోజుల నుంచి విద్యార్థులు హాస్టల్‌కు వస్తున్నారు. అప్పటి నుండి వారంలో ఐదు రోజులు గుడ్లు, అరటి పండ్లు విద్యార్థులకు అందించాలి. అలాగే బుధ, ఆదివారాల్లో చికెన్ కర్రీతో భోజనం పెట్టాల్సి ఉంది. కానీ వారంలో రెండు రోజులు గుడ్లు, అరటి పండ్లు, ఒక బుధవారం చికెన్ మాత్రమే ఇస్తున్నట్లు తెలిసింది. ఉదయం 6.30 గంటలకు రాగి జావా, ఒక గ్లాస్ పాలు విద్యార్థులకు అందించాల్సి ఉండగా.. హాస్టల్ ప్రారంభమైనప్పటి నుంచి జావా, పాలు ఇవ్వలేదని తెలుస్తోంది. విద్యార్థులు పాఠశాల నుండి తిరిగి వసతి గృహానికి చేరిన తర్వాత సాయంత్రం 5గంటల సమయంలో స్నాక్స్ అందించాలి. కానీ వారం రోజులైనా విద్యార్థులను



సాయంత్రం స్నాక్స్ ఇవ్వట్లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు మెనూ పాటించకపోతే వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి వార్డెన్ రమేష్‌ను 'అక్షరటుడే' సంప్రదించగా.. వసతిగృహంలో సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యార్థుల మెనూపై ప్రశ్నించగా.. తప్పనిసరిగా మెనూను అమలు చేస్తామన్నారు.

## పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న నిరసన

**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల ఆందోళన ఎనిమిదో రోజుకు చేరుకుంది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీజీపీఈజేఏసీ నాయకులు కె. సతీష్, ఎం.డీ. రఫీక్, దేవరాజ్, ఎం. ప్రవీణ్, చంద్రశేఖర్, నరేష్, శృతిమ, రాంబాబు, స్వాతి, ఏ.వి. శ్రీనివాస్ తదితరుల నాయకత్వంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్‌కో ఉద్యోగులకు మద్దతుగా ట్రాన్స్‌కో, డిస్కం ఉద్యోగులు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. యాజమాన్యం టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





## ప్రమోషన్ పొందిన కానిస్టేబుళ్లకు అభినందన

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారిని సీపీ సాయిచైతన్య సోమవారం అభినందించారు. ట్రాఫిక్ పీఎస్‌లో ఉన్న పీసీ జి. లింగం, రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో పీసీగా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌లకు ప్రమోషన్లు వచ్చాయి. ఈ సందర్భంగా వారు సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుళ్లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.



## ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ముకుంద రెడ్డి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా ఎక్సైజ్ శాఖలో బదిలీలు కొనసాగుతున్నాయి. మొన్నటివరకు ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగింది. తాజాగా జిల్లా ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ హన్మంత్ రావు సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై మల్కాజిగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్కాజిగిరిలో అడిషనల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముకుందరెడ్డి పదోన్నతిపై కామారెడ్డికి వచ్చారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. నూతన సూపరింటెండెంట్‌కు పలువురు ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## తెయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థులు



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఛాంబర్‌ను ఏబీవీపీ కార్యకర్తలు ముట్టడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి ఫీజులు కట్టించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ ఇందూర్ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల నుండి అడ్మిషన్ రోజే కోర్సు ఫీజులు కట్టించుకోవడం సిగ్గుచేటన్నారు. అలాట్‌మెంట్ ఆర్డర్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ఎలాంటి రుసుము లేకున్నప్పటికీ, రూల్స్‌కు విరుద్ధంగా అధికారుల వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. యూనివర్సిటీ సెక్రెటరీ సమీర్, ప్రాంత వనవాసి కన్వీనర్ అశోక్, శివ, మనోజ్, భార్గవ్, దుర్గ దాస్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీఎస్‌కు ఘననివాళి..

**మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ ఎక్స్ రోడ్‌లో ఆయన విగ్రహానికి పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు విశేష కృషి చేసిన నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల విద్యాధికారి రాజులు సందర్శించి పిల్లలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ శిబిరానికి మండల పరిధిలోని ఏడుగురు దివ్యాంగ చిన్నారులకు వైద్యుడు అరుణ్ చికిత్స నిర్వహించారు. చిన్నారులకు అవసరమైన వ్యాయామాలు చేయించడంతో పాటు తల్లిదండ్రులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజులు మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇలాంటి శిబిరాలు నిర్వహించి దివ్యాంగ చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. భవిత కేంద్రంలో అందుతున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గంగాజలంతో దేవతామూర్తులకు అభిషేకం

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని దేగాంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో గంగాజలంతో దేవతామూర్తులకు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఆనవాయితీగా రెండుసార్లు గంగాజల అభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ అభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి, ఉజ్వల ట్రస్ట్ అధ్యక్షుడు మినీ శ్రీకాంత్, గ్రామ పెద్దలు తిరుమల గౌడ్, లింగన్న, రవికిరణ్, భోజన్న, గొల్ల చిన్న భోజన్న, నరేష్,రాజేశ్వర్ తిరుపతి, భూమేష్, వార్డ్ సభ్యులు సందీప్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యభిచార గృహంపై పోలీసుల మెరుపుదాడి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యభిచార గృహంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పీఎస్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఓ మహిళ, పురుషుడిని సైతం పట్టుకున్నారు. విచారణలో నిందితులు నాలుగు నెలలుగా అద్దె ఇంట్లో రహస్యంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు, హైదరాబాద్‌కు చెందిన బ్రోకర్ ద్వారా మహిళలను ఇక్కడికి రప్పిస్తున్నట్లు తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితులు ఇద్దరితో పాటు విటుడిని అరెస్టు చేయగా, బాధిత మహిళను రక్షించి సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టారు. బాధిత మహిళను న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చడం జరిగిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్రోకర్ ప్రస్తుతం పరారీలో ఉండగా, ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్‌హెచ్‌వో వివరించారు. వ్యభిచార గృహం నిర్వాహకులపై గతంలో నగరంలోని ఐదో టౌన్‌లో కూడా వ్యభిచారానికి సంబంధించిన కేసు నమోదైనట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో 15 మందికి జైలు

**అక్షరటుడే, కామారెడ్డి:** మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసి మందుబాబులను కోర్టులో హాజరుపరుస్తున్నారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 73 మందిని కోర్టులో హాజరుపర్చగా, వారికి మొత్తం రూ.88,700 జరిమానా విధించారు. అలాగే 14మందికి ఒక రోజు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను న్యాయస్థానం విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం అమాయకుల ప్రాణాలకు ముప్పు అని, కుటుంబాల్లో కన్నీరు తెప్పించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత కోసం జిల్లాలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యుత్ ఉప కేంద్రాల్లో కెపాసిటర్ బ్యాంక్ ఏర్పాటు



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో కెపాసిటర్ బ్యాంక్‌ను ఏడీఈ (కన్స్ట్రక్షన్) తోట రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. దీని ఏర్పాటుతో వ్యవసాయదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో ఓల్టేజ్ పెరుగుతుందని.. అలాగే 33కేవీ లైన్లలో విద్యుత్ నష్టాలు తగ్గుతాయని తెలియజేశారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం కూడా తగ్గుతుందన్నారు. సీఎండీ ఆదేశాల మేరకు 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలలో కెపాసిటర్ బ్యాంక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం కల్లూరు, శ్రీనగర్, ఏఆర్‌పీ క్యాంప్ విద్యుత్ ఉప కేంద్రాల్లో ఈ బ్యాంక్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో 31, రెండో విడతలో 11, మూడో విడుతల 41 కెపాసిటర్ బ్యాంక్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మన్ సాయిబాబా, సిల్వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.